# పుణ్యస్నానం

-పండా నాగేంద్ర త్రినాథ్

మే నెలలో...

ఆకాశం మేఘావృతంగా వుంది. ఉరుములు... మెరుపులు. సన్నని జల్లులు మొదలయ్యాయి. గాలి చల్లబడటంతో మండువేసవి వడగాల్పుల నుంచి జనానికి ప్రాణంలేచి వచ్చినట్టయ్యింది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి తీవ్రత ఎలా వుంటుందో తెలియకపోయినా వాతావరణ మార్పుతో అంతా చల్లబడ్డారు.

గోదావరి ఒడ్డునే ఇళ్ళేమో... మరీ చల్లగాఉంది. గాలి తీవ్రంగా ఉండటంతో ఎవరూ నావలు తీయలేదు.

ఏరా... వలకట్టు గట్టిగా కట్టావా? "మొన్నపౌర్ణమినాడు రేండేలు ఖర్చుపెట్టి గుంజ పాతించాం... పరిగెలు ఏం పడకపోయినా... ఈ పెట్టుబడి మాత్రం తప్పటం లేదు... దానికి ఈ గాలోన ఒకటి తోడయ్యింది". విసుగ్గానే అన్నాడు నర్సింహులు.

"వల కట్టుకేంగానీ... నావే జారుముడేశాన్రా. అదే కొంచెం డౌటెడతోంది. అయినా పర్లా... ఎక్కడికిపోద్ది... ఇంకా పొద్దు పోలేదు కదరా.. నే చూత్తాలే". నర్సింహాయితో కొడుకు సమాధానంగా చెప్పాడు.

దూరంగా మైకు మాటలు గాలి సప్పుడికి దగ్గరయి దూరమవుతున్నాయి. హెచ్చ...... రిక...... పొన్నపల్లి ...... ప్రజల...... కు....

మాటలు సరిగా వినబడటం లేదు.

మైకురిక్షా నెమ్మదిగా పేటకు దగ్గరవుతోంది. చినుకు... గాలి మోలామాట స్పష్టత రావటం లేదు.

వస్తాదుండు... నీకంతా కంగార్రా....! కసురుకున్నాడు. "అర్బన్ బ్యాంకోడేమోరా... తినేత్తన్నాడు నాకొడుకు... తిన్నివ్వడు... తాగనివ్వడు. ఆడు బాగా దోసుకు దొబ్బాడు... ఇప్పుడు మనల్ని బాకీ గురించి చేపను తోమినట్టు తామ్మేస్తన్నాడు" నర్సింహాయి జోస్యంగా చెప్పాడు.

అర్బన్ బ్యాంకోడు కాదురా.. ఆడికి రిక్షా ఏటి కర్మ. కారుమీద తిప్పుతాడు. మన ప్రాణం తీయటానికి. అదుగో దగ్గర పడుతోందిరోయి రిచ్చా...!

హెచ్చరిక...

పొన్నపల్లి ఏటిగట్టు వాడ ప్రజలకు హెచ్చరిక...

"తెల్లారేసరికల్లా గట్టు పక్కనగల ఇళ్ళన్నీ మీకు మీరే తీసుకోవాలి. లేని పక్షంలో మున్సిపాలిటీ వారు మీ ఖర్చుపైనే తొలగించాల్సి వుంటుంది. మీకు మీరుగా తీసుకుంటే సామాన్లు దక్కుతాయి. గుర్తించగలరు. ఇట్లు, మున్సిపల్ కమీషనర్, నరసాపురం".

హెచ్చరికను మళ్ళీ చెప్పాడు.. మరోసారి చెప్పాడు... ఇంకోసారి. అలా పేటంతా రిక్షాతో హెచ్చరిక కలియతిప్పారు.

చాలామంది ఆడ... మగా... చిన్నా పెద్దా... రిక్షా చుట్టూ మూగారు. ఇదేంట్రా అబ్బాయి...

"తుపానుగా ఉంటే... బళ్ళోకి రండి... గుళ్ళోకి రండని పిలిచేవారు. అన్నాలెడతామనే వారు. ఇదేం సిత్రం. తుపాను ఏం మింగేత్తాదోనని మేం భయపడుతుంటే... నువ్వు కొంపలు పీకేస్తారంటూ వచ్చేవేంటి. మేం ఎవడికి అడ్డం వచ్చాంరా... ఆడి తల్లి రమ్మనమను వలకట్లోంచి వల్లకాడికి పోతాడు". కొంచెం మందులో ఉన్న నాయకుడు రిక్షాలో కూర్చుని చెబుతున్న ఎనౌన్సరుపై ఉరిమాడు. "నాకేం తెల్సయ్యా... చెప్పమన్నారు చెబుతున్నాను. ఆగస్టులో పుష్కరాలు కదా. పెద్ద రోడ్డు నుంచి పై శ్మశానం దాకా రోడ్డు వేస్తారంటా. మొత్తం రోడ్డు ఏటిగట్టు మీద నుంచే వేస్తారంట. 2 కోట్లు మంజూరు చేసేశారంట కూడా. మీ వాళ్ళకి ఇంకా చెప్పలేదేంటి. ఇంకేమనుకున్నా ఖాళీ చేసేయక తప్పదు." మైకువాలా విషయం వెల్లడించాడు. తుపాను గాలికి తోడు... మీద పిడుగు పడినట్లయింది. పేటంతా ఒక్కటే గొడవ. మన కొంప మీద నుంచి రోడ్డేమిటని అప్పుడే కస్సుబుస్సు లాడుతున్నారు.

పుష్కరాలకు... మన పేటకు సంబంధం ఏమిటి? కొత్తగా రోడ్డేస్తే ఉన్న గట్టు మీదనుంచే

వేసుకోవాలి. అంతే తప్ప మన గుడిసెలు తీయటమేమిటి? నలుగురూ గుమిగూడి చర్చ ప్రారంభించారు.

ఓ వైపు తుపాను గాలి జోరు అందుకుంది. సంధ్యా సమయం కూడా దగ్గరయ్యిందేమో గోదావరిలో అలలు ఉధృతిని చాటుతున్నాయి.

పేటలో వాళ్ళంతా గుళ్ళో సమావేశం అయ్యారు.

ఏం చేద్దాంరా పెద్దా? అడిగాడు ఓ యువకుడు.

"మన వార్డు కౌన్సిలరును తీసుకుని మంత్రిగారి దగ్గరకు వెళ్ళిచెబుదాం. ఆయనుంటాడేమిటి!

"ఆయన బావమరిది గారుంటారు కదా. ఆయనేగా మనకు మంచొచ్చినా చెడ్డొచ్చినా చూసేది. ఎల్లి పాకలు తీయటం కుదరదని కచ్చితంగా సెప్పేద్దాం"

చినుకుగాలిలోనే వందమంది పైగా గుంపుగా నాయకుడి ఇంటికి బయలుదేరారు. వాళ్ళలో వాళ్ళకే గొడవలు. కొంతమంది ఏమీ సాయం చెయ్యరని. కొంతమంది మనకి ఆయనే చెయ్యకపోతే ఎవరు చేస్తారని. వాళ్ళలో వాళ్లు తర్జనభర్జనలు పడుతున్నారు. తాగిన మత్తులో కొందరు తిట్ల దండకం మొదలుపెట్టారు.

మంత్రిగారింటికి వెళ్లేలోగానే చాలా మంది పడిపోయారు. తాగుడు వాళ్ళ బలహీనత. సంపాదనంతా చీప్‌లిక్కర్‌కే చాలదు. అదే వాళ్ళను ఏళ్ళ తరబడిగా దరిద్రం నుంచి బయట పడనీయదు. గోదావరి... సముద్రం ఎంత సంపదనిచ్చినా వ్యసనం కారణంగానే పేదరికంలో మగ్గిపోతున్నారు. చింకి పాకల నుంచి బయటపడలేకపోయారు.

ఎవరి కోసం బాబూ...

మంత్రిగారు కావాలమ్మా...

ఆయన హైదరాబాద్‌లో ఉన్నారుగా...

పోనీ... ఆయన బావమరిది గారైనా...

పొలాన్న ఉన్నారయ్యా...

మళ్ళీ గుంపు కదిలింది. పొలం వెళ్ళారు. కాని చీకటి పడుతోంది.

"ఏంటి ఇలా వచ్చారు". నవ్వుతూ అడిగాడు మంత్రి బావమరిది. మత్స్యకారులు తమకష్టం చెప్పుకున్నారు.

"సబ్-కలెక్టరు, కమిషనరులతో మాట్లాడదాం. ఒక వేళ ఇళ్ళు తీసివేయాల్సి వస్తే ప్రత్యామ్నాయంగా స్థలాలు ఇవ్వమని చెబుతాను. మీకు అభ్యంతరం లేదు కదా?."

"గోదావరి పక్కన మా తాతల కాడినుంచే వున్నాం. ఒక్కపలంగా ఎల్లిపొమ్మంటే ఎలాగండి. ఒకేళ ఆళ్ళు మాకు స్థలం ఇచ్చినా...ఎక్కడిస్తారో... మా వేట పనులకు, రేవు దాటించడానికి సమస్య రాదా. బతుకుతెరువు పోదా?" మత్స్యకారుల నాయకుడు కిష్టప్ప బాధగా అన్నాడు.

"ఇప్పుడు మన చేతిలో ఏదీ లేదు. పుష్కరాలకు 50 కోట్లు గ్రాంటు ఇచ్చారు. అందువల్ల తప్పనిసరిగా ఈ రోడ్డు వేయక తప్పదు. మీరే ఎలాగోలా సర్దుకోవాలి. ఇళ్ళు కట్టుకునేందుకు బావగారితో మాట్లాడి ఏదైనా స్కీమ్‌లో పెట్టిస్తాను. అంతవరకూ ఓపిక పట్టండి". నెమ్మదిగా కదిలారు.

తెల్లవారింది. తుపాను తీరం దాటడంతో వాతావరణం సాధారణ స్థితికి చేరింది. చెట్ల క్రింద, రేవు మెట్ల మీద కూర్చుని ఇళ్ళు తీసేసే విషయం మీదే మాట్లాడుకుంటున్నారు.

"ఏంట్రా పిల్లలు ఏటిగట్టు మీదనుంచి పరుగుమీద వస్తున్నారు".

ఏమో మరి...ఎవరైనా వస్తున్నారేమో.. గవర్నమెంటోళ్ళ జీపులు వస్తున్నాయేమో... పిల్లలు దగ్గర పడ్డారు.

అయ్యా... అయ్యోయ్.. వచ్చేస్తంది....


ఏంట్రా... అది...

"అదే తొండంలా వుంటాది... చెట్లు... ఇళ్ళు... స్థంభాలు వడేస్తాది. మొన్న బజార్లో చూపించావుగా... అదే తప్పే మిసను... వొగురుస్తూ చెప్పాడు కుర్రాడు.

పొక్లయినరు... దానివెనకే సబ్-కలెక్టరు జీపు... ఎం.ఆర్.వో. జీపు... కమిషనరు జీపు ఉన్నాయి. పొక్లయినరును రేవులో పెట్టారు.

కలెక్టరుగారొచ్చారు... అందర్నీ పిలవండి. మీతో మాట్లాడతారట. ఆశగా పేట కదిలింది.

"నమస్కారమండీ బాబూ...మీరేసాయం చేయాలి. ఎలాగోలా మా కొంపలు పోకుండా చూడాలి. పిల్లా పాపల్తో వున్నాం. గోదారి పుట్టిన కాడినుంచి మా పెద్దోళ్ళు ఈడనే వున్నారు. ఇవేం



గోర్నమెంటు భూములు కావండిబాబు. కొన్నాయే. దస్తావీజులు కూడా వున్నాయండి. మీరే కాయాల మమ్మల్ని..." ఆదుర్దాగా గుండె బరువుతో అడిగాడు కిష్టప్ప. ఎం.ఆర్.వో. గారు... మీరు చెప్పండి. సబ్-కలెక్టరు ఆదేశించారు.

"చూడండి బాబూ... మీ ఇళ్ళ ముందునుంచి ఏటి గట్టు వుంది. గట్టును వెడల్పు చేసి పెద్ద రోడ్డు వేస్తారు. ఇందుకోసం గ్రాంటు వచ్చింది. పెద్దరోడ్డుకు దీన్ని కలుపుతారు. మీరు సామాన్లు తీసుకుంటే మా కొల్త ప్రకారం వచ్చిన స్థలం తీసుకునేందుకు పాకలను పడగొడతాం. మీరు ప్రశ్నలు వేయకుండా మీకు మీరుగా సామాన్లు తీసుకుంటే వారం రోజుల్లో పట్టాలిస్తాం. అందులో ఇళ్లు కట్టుకునేందుకు వాల్మీకి అంబేద్కర్ స్కీము కింద 20 వేలు సబ్సిడీతో రుణం ఇస్తారు. మీకు పందిర్లాంటి ఈ గుడిసెల బాధ తప్పుతుంది. వరద వచ్చినా... తుపాను వచ్చినా భయం వుండదు. హాయిగా వుండవచ్చు". ఎంతో మేలు చేస్తున్నట్లు ఎం.ఆర్.వో. చెప్పారు.

"సరేననుకోండి... స్తలాలు ఎక్కడిస్తారు.

"25వ వార్డులో గుడి వెనుక కేటాయించాం."

"అది వూరు చివర కదాండి".

"తప్పదయ్యా వెళ్ళాలి... కాదంటే అదీ వుండదు. పైనుంచి ఆర్డర్సు". సబ్-కలెక్టరు కయ్యిమన్నాడు.

"ఒక్కో ఇంట్లో ఇద్దరున్నారండి. తీరా తీసేసాక మీరు ఒక్కళ్ళకే ఇస్తే అన్యాయమైపోతాం. మాలో మాకు గొడవలు వచ్చేస్తాయ్".

అవన్నీ తర్వాత... ముందు ఖాళీ చేయాలి. మరో రెండు గంటల్లో ఇళ్ళను పడగొడతాం. టైం లేదు. మరో రెండు నెలల్లో పుష్కరాలు. ఈలోగా రోడ్డు రెడీ చెయ్యాలి". ఎం.ఆర్.వో. హెచ్చరికగా చెప్పాడు.

"గోదారి మీద బతికే వాళ్ళం... రోజూ వూరి చివరి నుంచి వలపట్టుకుని మళ్లీ ఈడకు ఎలా వస్తాం. పైగా మా వాళ్ళంతా ఈ పేటలో వున్నాం. గోదారి పక్కనే వున్నామని ఇంతకాలం పొంగిపోయాం. ఆ తల్లి ఉరిమినా... శాంతంగా సూసినా.. ఈడే వుండిపోయాం. ఉన్నదాంట్లో

రోడ్డేసుకుని మా కొంపలను మిగల్చటం కుదరుద్దేమో చూడండి బాబు". అదేం కుదరదయ్యా... అంతా జరిగిపోయింది. దీన్ని టూరిస్ట్ స్పాట్‌గా మారుస్తాం. ఇందుకోసం మంత్రిగారు కృషి చేస్తున్నారు. మీరు ఏదైనా చెప్పుకున్నా ఇక ఆయనతోనే. తొందరగా సామాన్లు తీసుకోండి" తొందరపెట్టాడు ఎం.ఆర్.వో.

పేటంతా హడావుడిగా వుంది. మత్స్యకారులు ఓ వైపు అధికారులతో మాట్లాడుతుండగానే ఆడాళ్ళు, పిల్లలు సామాన్లను సర్దుతున్నారు. వలలు.. ఇత్తడి సామాన్లు... వంటపాత్రలు.. పాత చెక్క సామాన్లు మూటగడుతున్నారు. ఏడుపులు వినబడుతున్నాయి. కొంతమంది శాపనార్థాలు పెడుతున్నారు. "మా కొంపలే దొరికాయా... ఈ మూలకి పెద్ద రోడ్డేసి ఎవడి నెత్తిన కొట్టుకుంటార్రా... మా కడుపులు కొట్టి గోదారి చూసేవాళ్ళకి... గోదాట్లో స్నానాలు చేసేవాళ్ళకి రోడ్లేస్తారా... వందల సంవత్సరాల నుంచి వున్నాం. పుష్కరాల వంకతో మా గుడిసెలు పీకేస్తారా.. మా ఉసురు తగలకపోదురా... నాశనమైపోతారు". పేటలోంచి తిట్ల పురాణం ఘాటుగానే సాగుతోంది. రోడ్డు పనులు మొదలయ్యాయి. ఇళ్ళన్నీ తొలగించారు. మత్స్యకారులకు ఊరి చివర స్థలాలు చూపారు. పట్టాలివ్వలేదు. దూరంగా వెళ్ళలేక పేటలోనే చాలామంది సర్దుకున్నారు. నెలరోజుల్లో ఎర్తు వర్కు చేశారు. ఏటిగట్టు బాగా వెడల్పయింది. బయటనుంచి వచ్చి చూసిన వాళ్ళంతా చాలా బాగా చేశారని మదిలో అనుకుంటున్నారు. పేటలో వాళ్ళు మాత్రం ఇళ్ళు పోయాయనే బాధలో వున్నారు.

ఎం.ఆర్.వో. జీపు పేటలో ఆగింది.

రోడ్డు పనులు పరిశీలించారాయన. "ఏంటీ ఈవిడ ఇంకా ఆ రావిచెట్టును వదల్లేదు. మంత్రిగారు వచ్చినప్పుడల్లా ఆయన కారుకి అడ్డుపడుతోంది".

"ఇలా పిలు మాట్లాడదాం."

"ఏమ్మా... ఎక్కడైనా గదిలో ఉండొచ్చుగా..ఎన్నిసార్లు చెప్పాలి నీకు. ఈ చెట్టు వదలవా?" ఎం.ఆర్.వో. అడిగారు.

"పుష్కరాలదాకా వుంటాను బాబు. మీరేమో మా ఇల్లు పడగొట్టించారు. గోదారితల్లి నా కొడుకుని మింగేసింది. ఆ పాకలో నేను, నా కోడలు పడోపడకో ఉండేవాళ్ళం. తీరా స్థలం చూపినపుపడు మీరేమో స్థలం నా కోడలికే ఇచ్చారు. నాకు కుదరదు పొమ్మన్నారు. రోజూ మీ ఆఫీసుకొచ్చి అడిగినా దయ కలగలేదు. పుష్కరాలదాకా వుండి తర్వాత పోదామని ఈ చెట్టుకింద ఉంటున్నా.. ఇక్కడుండటం కూడా కష్టంగా వున్నట్టుంది బాబు మీకు...." సీతమ్మ వేదనగా చెప్పింది.

"నీ కోడలికో స్థలం... నీకో స్థలం ఎలా ఇస్తాం. ఇద్దరూ సర్దుకోవాలి". "నా కొడుకుంటే అలాగే సర్దుకునే వాళ్ళం బాబు. నా కోడలు నా నీడే పడనీయదు. అందరికీ ఎరుసైపోయాను" సీతమ్మ ఏడుస్తూ చెప్పింది.

"సరిసర్లే... చెట్టుకింద సామాను తీసేయ్. కలెక్టరుగారు వస్తారు."

గోదావరి ఒడ్డంతా సందడిగా ఉంది. పుష్కరాలు రానే వచ్చాయి. ఎటు చూసినా జనమే. స్నానఘట్టాల వద్ద జనం తోరణాల్లా ఉన్నారు. చీమల బారుల్లా కనబడుతున్నారు.

"ఎవరూ నీళ్ళలోకి లోపలి వరకూ వెళ్ళకండి'.

"ప్రమాదం జరుగుతుంది. గజ ఈతగాళ్లూ... జాగ్రత్తగా పరిశీలించండి. ఎవరినీ తాళ్ళు దాటి రానీయవద్దు" ఎనౌన్సరు హెచ్చరిస్తూనే వున్నారు.

జనం పుష్కర స్నానాల్లో నిమగ్నమయ్యారు.

సీతమ్మ జనం మధ్యలోంచి ముందుకు సాగింది. గోదావరి తల్లికి నమస్కరించింది. పంతులుగారికి రెండురూపాయలిచ్చి మంత్రం చెప్పించుకుంది. గోదావరిపైపు మనసారా చూసింది.

ఏమ్మోయ్... ఓ ముసలావిడా ఎందుకంత లోపలికి....

వెనక నుంచి కేకలు వినబడుతున్నాయి.

సీతమ్మ... మూడు మునకలు వేసింది. అంతే ఆ తర్వాత పైకి లేవలేదు. ఆమె పుణ్యస్నానం ముగిసింది.

మర్నాడు ఉదయం... మూడు రేవుల దూరంలో సీతమ్మ శవం దొరికింది. ఆమె ఇంటిపై నుంచి వేసిన రోడ్డు మీదుగానే సీతమ్మ శవయాత్ర సాగింది.

స్థలం పోయిందనే బాధలోనే... పుష్కరాలలో దేవుడిని చేరుకుందని పేటవాసులు చెప్పుకున్నారు. కొందరు నిట్టూర్చారు. ●